క్లుప్తంగా

క్రిస్మస్ కానుకల పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని క్రిస్టియన్ భవన్‌లో శనివారం క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పాల్గొని క్రైస్తవులతో కలిసి కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన కానుకలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

గజ్వేల్‌రూరల్: ఆధ్మాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. గీతా జయంతిని పురస్కరించుకొని శ్రీరామకోటి భక్తసమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కృష్ణాలయంలో భగవద్గీత పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత మనిషిలోని నిరాశను పోగొట్టి ఆశాజీవిగా మారుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసతావేదిక అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, కృష్ణాలయం నిర్వాహకులు రామచంద్రం, వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, మల్లేశం, దశరథం తదితరులు పాల్గొన్నారు.

బోరుమోటార్ల దొంగల రిమాండ్

తొగుట(దుబ్బాక): బోరు మోటార్ల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తొగుట ఎస్‌ఐ లింగం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చందాపూర్ టీ జంక్షన్ వద్ద ఉదయం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి ఇద్దరు ద్విచక్రవాహనంపై బోరు మోటారుతో పారిపోయేందుకు ప్రయత్నించారు. చాకచక్యంగా వారిని పట్టుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన బొడ్డు రమేష్, నర్సెట్టి ప్రశాంత్, నీల వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వీరు తొగుట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో బోరు మోటార్లు దొంగిలించి గజ్వేల్, సిద్దిపేటలో వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. వీరి నుంచి 3 మోటార్లు, ఒక వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన దుర్గమ్మ గుడిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం అటుగా వాకింగ్ వెళ్లిన పట్టణ కేంద్రానికి చెందిన రమేష్‌రెడ్డి గుడి వెనకాల హుండీ పడి ఉండడాన్ని గమనించి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీధర్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే అతడు స్థానికులతో కలిసి వెళ్లి చూడగా గుడి తాళం పగులగొట్టి ఉంది. రెండు హుండీలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ దామోదర్ వెంటనే ఘటనా స్థలికి వెళ్లి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీలో సుమారు రూ. 9,500 నగదు అపహరణకు గురైనట్లు చెప్పారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై యువకుల దాడి

తొగుట(దుబ్బాక): ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ పై దాడిచేసిన ఘటన మండలంలోని వెంకట్రావుపేట శివారులో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ప్రయాణి కులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శనివారం సాయంత్రం ప్రయాణి కులతో బస్సు దుబ్బాకకు బయలుదేరింది. బస్సులో ఉన్న ఓ యువతి గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ స్టేజీ వద్ద దిగాల్సి ఉండగా, కొల్గూరు స్టేజీ వద్ద దిగింది. బస్సు తొగుట మండలంలోని చందాపూర్, వెంకట్రావుపేట గ్రామాల్లో ప్రయాణికులను దించి వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు వెంకట్రావుపేట శివారుకి రాగానే ఓ ఆటోలో యువతితోపాటు కొందరు గుర్తు తెలియని యువకులు బస్సుకు అడ్డుగా వచ్చారు. డ్రైవర్ బస్సును ఆపగానే యువకులు అతడిపై దాడి చేశారు. యువకులు తనపై దాడి ఎందుకు చేశారో తెలియదని బస్సు డ్రైవర్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. యువకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణి కులు ప్రభుత్వాన్ని కోరారు.

సన్మానం

కొండపాక(గజ్వేల్): మండలంలోని అంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ జాలిగామ నర్సింగరావు శనివారం హైదారాబాద్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

ఆలయాలకు ముక్కోటి శోభ

పవిత్ర ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు చలిని సైతం లెక్క చేయకుండా ఆలయాల్లో బారులు తీరారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



దుబ్బాక బాలాజీ ఆలయంలో భక్తుల సందడి



చేర్యాల: వేణుగోపాలస్వామి ఆలయంలో..



దుబ్బాకటౌన్: స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దంపతులు



నంగునూరు వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు



వర్గల్: శేషతల్పంపై వర్గల్ వేణుగోపాలుడు



కొండపాకలో..



మద్దూరు: గాగ్గిళ్లాపూర్‌లో..



గజ్వేల్‌లో జడకొప్పు ఆడుతున్న మహిళలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈప్రాంత ప్రజల చిరకాల కోరికైన దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే డివిజన్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలను కలుస్తానని చెప్పారు. పట్టణంలో రోడ్ల అభివృద్ధితో పాటు హబ్సీపూర్–దుబ్బాక ఫోర్ లైన్ రోడ్డు మంజూరుకు కృషి చేస్తానన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువలు చాల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పూర్తిస్థాయిలో కాలువలు పూర్తయితే ఈ ప్రాంతమంతా కరువు లేకుండా ఉంటుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డి రైతు వేదికలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు, ఇళ్లు కూలిపోయి నష్టపోయిన వారికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, కోఅప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, సర్పంచ్‌లు కాలేరు శ్రీనివాస్, చుక్క శంకర్, ఎనగంటి కిష్టయ్య, ఎంపీటీసీ సుతారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై రఘునందన్‌రావు కపట ప్రేమ



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక మాజీ బీజేపీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావుకు దళితుల పట్ల ఉన్న కపట బయట పడిందని మిరుదొడ్డి, అక్బర్‌పేట– భూంపల్లి మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డిలో శనివారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత నాయకుల ఎదుగుదలను జీర్ణించుకోలేని రఘునందన్‌రావు తన ఉనికిని చాటుకుంటున్నాడని మండిపడ్డారు. బక్కి వెంకటయ్యను విమర్శించే నైతిక హక్కు రఘునందన్‌రావుకు లేదన్నారు. గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, కోఅప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



రైతు వేషధారణలో చిన్నారులు

బాలలు భళా..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట– భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో చార్వాక మోడల్ స్కూల్‌లో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. రైతుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. రైతులు పండించే సాగు విధానంతో పాటు వారు పడే కష్ట నష్టాలపై విద్యార్థులకు టీచర్లు అవగాహన కలిగించారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

తుది శ్వాస వరకు మీ సేవలోనే..

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: తుది శ్వాస వరకు మీ సేవలో ఉంటా.. ఈజీవితం సిద్దిపేట ప్రజలకే అంకితం అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, జీఓ 59 కింద పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 11,014 మందికి రూ. 93 కోట్ల ఆర్థిక సాయం పంపిణీ చేసినట్టు వివరించారు. పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఆసరా వచ్చిందని తెలిపారు. సిద్దిపేట ప్రాంత ప్రజల కోసం అన్ని హంగులతో కూడిన కార్పొరేట్ స్థాయి ఆస్పత్రికి ఏర్పాటు చేశామని,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, నాయకులు రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సంపత్‌రెడ్డి, బాబు, కౌన్సిలర్లు రవి శ్రీహరి, మోహిజ్, విఠోభ, సాయి ఈశ్వర్, ఎల్లం, రఘురాం,అరవింద్, ఆనంద్, నాగరాజు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపాలిటీ లింగారెడ్డిపల్లి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బర్ల మల్లిఖార్జున్, సీనియర్ నాయకులు రంగదాంపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: అయోధ్య పూజిత అక్షింతల మహా శోభాయాత్ర శనివారం గజ్వేల్ పట్టణంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సంతోషిమాత దేవాలయం నుంచి సీతారామ ఉమామహేశ్వర దేవాలయం వరకు పట్టణంలోని పురవీధుల గుండా భక్తులు శ్రీరామనామ స్మరణతో భజనలు చేస్తూ, సంకీర్తనలను ఆలపిస్తూ పాదయాత్ర చేపట్టారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయాలతో చిన్నారి

సిద్దిపేటజోన్: ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారులపై కుక్క దాడి చేయడంతో ఐదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సిద్దిపేటలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆరు బయట ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులను కుక్క గాయపర్చింది. ఈసంఘటనలో చిన్నారి రియాన్స్ తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రిఫర్ చేసినట్టు సమాచారం. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్–ఎల్కతుర్తి నేషనల్ హైవే పనుల్లో భాగంగా విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేపడుతున్నామని.. ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట మెడికల్ కళాశాల, డీఎక్స్‌ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

దుబ్బాక: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నామని దుబ్బాక ఆటో యూనియన్ అధ్యక్షుడు మండల నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలంటూ శనివారం దుబ్బాక బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక మండల ఆటో యూనియన్ నాయకులు చందు, షాదుల్, రవి కుమార్, ప్రవీణ్, నజీర్, నందు, సుమన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పేదలకు దుప్పట్ల పంపిణీ**

గజ్వేల్: మండలంలోని శేర్‌పల్లికి చెందిన గుండాగారి సరళ జ్ఞాపకార్థం శనివారం గజ్వేల్‌లోని వాగుగడ్డ హనుమాన్ ఆలయంలో పేదలకు అహ్మదీపూర్‌కు చెందిన చాడ విష్ణువర్ధన్‌రెడ్డి స్వామి దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగం రమేశ్ స్వామి, పెండెం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పీవీకి నివాళి**

కోహెడ(హుస్నాబాద్): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పీవీ సేవా సమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో కోహెడలో నిర్వహించారు. ఈసందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

◆ **నేడు బెక్కల్‌లో సరస్వతీ యజ్ఞం**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం సరస్వతీ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాలయగుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

◆ **ఘనంగా రైతు దినోత్సవం**



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) ఫర్టిలైజర్స్‌లో శనివారం రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వాల్ కంపెనీ డీలర్ సహకారంతో రైతులను సన్మానించారు. మహిళా రైతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఈలు మానాల తిరుమల, రవి, స్వాల్ ప్రతినిధి గణేష్, డీవీరావు, మెట్ట నాగరాజు, బాబు, భాస్కర్ రెడ్డి, గోపాల్, పాల్గొన్నారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమంతో పాటు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రజిత, సునీత, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

◆ **రసాయన ఎరువులపై అవగాహన**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల రైతు వేదికలో శనివారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై దేశ్‌పాండే స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రమేశ, రైతులు పాల్గొన్నారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

నంగునూరు(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం అక్కేనపల్లి మోడల్‌స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేయాలని కోరారు.

◆ **నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ**

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఉమ్మడి జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడాల సురేందర్ ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామమైన మండలంలోని బేగంపేటలో నాగదేవత పున: ప్రతిష్ఠ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హోమం నిర్వహించి అన్నదానం చేశారు.

◆ **జీవనోపాధి కల్పించాలి**

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు జీవనోపాధి అవకాశాలు కల్పించాలని మండల ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు పేర్ల రమేష్ కోరారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం యూనియన్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల జీవన భృతి చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **'డబుల్' ఇళ్లు విక్రయించడం సరికాదు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూంలు బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులకు విక్రయించడం సరికాదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. డబుల్ బెడ్రూంలు పేదలకు ఉచితంగా కాకుండా డబ్బులు తీసుకుని అందించారని, పూర్తి సమాచారం తన వద్ద ఉందన్నారు. పూర్తి వివరాలు కలెక్టర్‌కు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరీ మధు, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు గయజుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, నజ్జు, అయ్యుబ్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.